అడుగడుగునా మడుగులే

- పెనుబల్లి ఎస్సీ కాలనీలో ఇంటింటా మురుగునీటి గుంత
- డ్రైనేజీ కాలువల్లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు



గేదెలకు ఆవాసంగా మారిన గుంతలు



డ్రైయిన్స్ లేకపోవడంతో కాలనీలో నిల్వచేరిన మురుగునీరు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పెనుబల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. 150 కుటుంబాలు ఉంటున్న కాలనీలో రోడ్లు సక్రమంగా లేకపోవడం, డ్రెయినేజీ కాలువలు నిర్మించకపోవడంతో ప్రతి ఇంటి వద్ద ఓ గుంత మురుగునీటితో నిండి ఆ నీరు రోడ్లపైకి చేరుతోంది. ఈ పరిస్థితితో దోమలు పెరిగి జ్వరాలు ప్రబలుతున్నాయి. కాలనీ లోతట్టు ప్రాంతంలో ఉండటం, కాలువలు లేక ఇళ్లలోని నీరు రోడ్లపైకి రావడంతో బురదమయంగా మారాయి. కాలనీ మధ్యలోకి ఈ నీరంతా చేరి ఓ మడుగులా తయారైంది. ఈ మడుగు గేదెలకు నివాసంగా మారి పరిస్థితి అధ్వానంగా తయారైంది.

వర్షం వస్తే ముంపే

వర్షాకాలం మొదలవుతున్న నేపథ్యంలో కాలనీవాసులు భయంతో వణికిపోతున్నారు. చిన్నపాటి వర్షం వస్తేనే వీధులన్నీ జలమయమవుతున్నాయని, భారీ వర్షం కురిస్తే కాలనీ చెరువులా మారి మునిగిపోయే ప్రమాదభరితంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే దృష్టి సారించాలి

కాలనీలో సమస్యలతో సతమతవుతున్నా గ్రామ సర్పంచ్ ఓడా పెంచలయ్య ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సమస్యను అధికారులు, కోవూరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రయత్నం చేసిన దాఖలాలు లేవు. అధికారులైతే కాలనీవైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇటు అధికారులు పట్టించుకోక, అటు నాయకులు ఏమీ తెలియనట్లు ఉండటంతో సమస్య జఠిలమైంది. ఎన్నోసార్లు పెనుబల్లి మీదుగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి బుచ్చిరెడ్డిపాళెం వెళ్తోందని, తమ కాలనీ వద్ద ఆగి పరిస్థితిని గమనించాలని స్థానికులు కోరుతున్నారు.

దోమల బెడద ఎక్కువ



కాలనీలో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఇంటి నుంచి మురుగునీరు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఫాగింగ్ కూడా చేయడం లేదు.

– కృష్ణవేణి, ఎస్సీ కాలనీ, పెనుబల్లి

రోగాలు ప్రబలుతున్నాయి



మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో చిన్నారులు అందులోనే తిరుగుతున్నారు. దీంతో రోగాలు ప్రబలుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నరసమ్మ, పెనుబల్లి ఎస్సీకాలనీ

కాలనీ మడుగులా ఉంది



కాలనీలో గుంతలు ఏర్పడి ఉన్నాయి. ఇళ్లలోని నీరంతా కాలనీలో లోతట్టు ప్రాంతంలో చేరి మడుగులా తయారై గేదెలకు ఆవాసంగా మారింది.

– వరలక్ష్మి, పెనుబల్లి, ఎస్సీ కాలనీ

ఎమ్మెల్యే సందర్శించాలి



కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఎన్నికల ముందు తమ కాలనీకి వచ్చారు. ప్రస్తుతం ఓ సారి తమ కాలనీని సందర్శించి సమస్యలను పరిష్కరించాలి.

– శేషమ్మ, పెనుబల్లి ఎస్సీ కాలనీ

పత్తాలేని అధికారులు



అధికారులు కాలనీవైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఎంపీడీఓ, గ్రామస్థాయి సిబ్బంది పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలి.

– పెంచలమ్మ, పెనుబల్లి ఎస్సీ కాలనీ

ఎక్కడి నీరు అక్కడే



కాలనీలో ఎక్కడ చూసినా అపరిశుభ్రంగా ఉంది. కాలనీ లోతట్టు ప్రాంతంలో ఉండటం వల్ల నెలల పాటు ఎక్కడినీరు అక్కడే ఉంటోంది.

– శశికుమార్, పెనుబల్లి ఎస్సీ కాలనీ

క్లుప్తంగా

నేడు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పొదలకూరు: హనుమజ్జయంతి తర్వాత వరుసగా ప్రతి మంగళవారం పట్టణంలోని వీర అభయాంజనేయస్వామికి శాశ్వత ఉభయకర్తలు ప్రత్యేక పూజలను నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఈ క్రమంలో మంగళవారం సుర్తాని మల్లెంకొండయ్య కుటుంబానికి చెందిన ఉభయకర్తలు ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు. ఉదయం ఆకుపూజ, విశేష పూజలను నిర్వహించి భక్తులకు ప్రసాదాలను అందజేస్తారు.

మహానాడులో కోవిడ్ నిబంధనలు పాటించాలి

నెల్లూరు(అర్బన్): ఈనెల 29న టీడీపీ నిర్వహించే మహానాడులో కోవిడ్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎమ్వీ రమణయ్య, టి.కామేశ్వరరావు కోరారు. ఈ మేరకు అమరావతిలోని సీఎం కార్యాలయానికి వారు సోమవారం అర్జీ పంపారు. ఈ సందర్భంగా నెల్లూరులో ఎమ్వీ రమణయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మళ్లీ కరోనా కేసులు పెరిగాయన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో పార్టీ సభలు, ప్రార్థనా సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించరాదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిబంధనలు రూపొందించాయన్నారు. అయితే జారీ చేసిన పెద్దలే కడపలో భారీ ఎత్తున జనసమీకరణతో సభలు నిర్వహిస్తుండటం బాధాకరమన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతే కృష్ణుని నిజబోధ



మనుబోలు: త్రైత సిద్ధాంత భగవద్గీతే శ్రీకృష్ణుని నిజమైన బోధ అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక పొదలకూరు కమిటీ అధ్యక్షుడు పెంచల నరసయ్య అన్నారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంతంపై అవగాహన కల్పించి భగవద్గీత ప్రతులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతా బోధన కులం, మతం ప్రమేయం లేకుండా ప్రతి ఒక్కరిని కార్యోన్ముఖులను చేస్తుందన్నారు. మంచి వ్యక్తిత్వ నిర్మాణం, నాయకత్వ లక్షణాలు, పోరాట పటిమ, నిష్కామ కర్మలను గీత బోధిస్తుందని తెలిపారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలియజేసేదే త్రైత సిద్ధాంత భగవద్గీత అన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పొదలకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం పక్కన మహిళల కుట్టు శిక్షణా కేంద్రాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టు శిక్షణతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 583 మందికి ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టు మిషన్లను అందజేస్తున్నట్టు తెలిపారు. మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. ఎంపీడీఓ డీవీ నరసింహారావు, తహసీల్దార్ బి.శివకృష్ణయ్య, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణకు కృషి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో కుష్టువ్యాధి నివారణకు వైద్యశాఖ సిబ్బంది కృషి చేయాలని జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. నగరంలోని వైద్యశాఖ కార్యాలయంలో కుష్టువ్యాధిపై సెక్టార్ల వారీగా సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రారంభ దశలో కుష్టును గుర్తిస్తే తగిన చికిత్స ద్వారా వారిని అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చన్నారు. ఎస్ఎస్‌టీడీ చికిత్స ద్వారా అంగవైకల్యం వ్యాప్తి చెందకుండా కాపాడవచ్చన్నారు.

పింఛన్ ఇప్పించాలని వినతి



కొడవలూరు: మండలంలోని రామాపురానికి చెందిన ప్రవీణ్‌కుమార్ తన సోదరికి ఒంటరి మహిళా పింఛన్ ఇప్పించాలని తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డిని కోరారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇచ్చారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ సామాజిక పింఛన్లు ఎంపీడీఓ పరిధిలో ఉన్నందున వారికి పంపి అర్హతను పరిశీలించి మంజూరు చేస్తారని వివరించారు.

అమ్మో.. నాగుపాము



కోవూరు: స్థానిక పంచాయతీ ఆఫీస్ ఎదురుగా ఉన్న ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి ఐదు అడుగుల నాగుపాము దూరింది. దీంతో దాదాపు రెండు గంటలసేపు ఇంట్లోని వారు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ క్రమంలో రాత్రి గస్తీలో ఉన్న పోలీస్ సిబ్బందిని పిలువగా హోమ్‌గార్డు మోహన్ వచ్చి దానిని చంపడంతో ఇంట్లోని వారు ఊపిరి పీల్చుకున్నారు.

ధ్యానంతో ఏకాగ్రత పెంపు



కొడవలూరు గ్రంథాలయంలో ధ్యానం చేస్తున్న చిన్నారులు

కొడవలూరు: ధ్యానంతో ఏకాగ్రత పెంపొందుతుందని లైబ్రేరియన్ కె.రాజేశ్వరి సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కొడవలూరు గ్రంథాలయంలో విద్యార్థులకు ధ్యానం, యోగాలపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ ధ్యానం, యోగా సాధన ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. రోజువారీ కార్యక్రమాల్లో వీటిని భాగం చేసుకోవడం ద్వారా విద్యలో రాణించడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు తెలుగు రాయడం, చదవడం బాగా రావాలన్నారు. ప్రతి విద్యార్థి మాతృభాషను బాగా అభ్యసించాలని కోరారు.

నేటి నుంచి పోటీలు

గ్రంథాలయంలో మంగళవారం నుంచి విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్, మ్యూజికల్ చైర్స్, అంత్యాక్షరి, చెస్, స్కిప్పింగ్ తదితరాల్లో పోటీలు నిర్వహిస్తామని లైబ్రేరియన్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు వచ్చే నెల 6న అధికారుల చేత బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



స్టాల్ వద్ద కూరగాయలను చూపిస్తున్న సిబ్బంది

విడవలూరు: ప్రజలకు ఆరోగ్యమైన ఆహారం అందించడమే ప్రకృతి వ్యవసాయం లక్ష్యమని, దీనిపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు సూచించారు. రైతు సాధికార సంస్థ, జిల్లా ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ డీపీఎం కొండయ్య మాట్లాడుతూ పూర్తి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకుకూరలను ప్రతి సోమవారం ఇక్కడ విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు వారికున్న పొలంలో కొంత భాగాన్ని ప్రకృతి వ్యవసాయం కోసం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో స్టాల్ ఇన్‌చార్జి కె.మహేంద్ర, మండల ఏఓ పి.వెంకట కృష్ణయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిన్నయ్య, మహేంద్ర, పుష్పరాజ్యం, వరలక్ష్మి, విజయలక్ష్మి, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

మత సామరస్యం ప్రతిఒక్కరి బాధ్యత

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకమరాజు



సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మత సామరస్యం, జాతీయ సమైక్యత పాటించడం ప్రతిఒక్కరి బాధ్యత అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ వెంకమరాజు అన్నారు. పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకమరాజు మాట్లాడుతూ పహల్గాం దాడిని తీవ్రంగా ఖండిస్తూ, మృతిచెందిన వారికి సంఘీభావంగా సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉగ్రవాద దాడిలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు మృతి చెందడం బాధాకరమన్నారు. ఉగ్రవాదాన్ని అణచివేయడంలో కేంద్రప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు, నాయకులు జానీబాషా, మునీర్, కోటయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాకాణి అరెస్ట్ అప్రజాస్వామికం

మనుబోలు: మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికమని ఆ పార్టీ నాయకుడు ఎల్ఎన్‌పురం ఎంపీటీసీ గుమ్మడి వెంకటసుబ్బయ్య అన్నారు. సోమవారం ఆయన మనుబోలులో మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను ఎండగట్టడంలో ఎల్లప్పుడు ముందుండే కాకాణిని కావాలనే అధికార పార్టీ నేతలు తప్పుడు కేసులలో ఇరికించి అరెస్ట్ చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా సూపర్ సిక్స్ హామీలను గాలికొదిలేసిన ప్రభుత్వ పెద్దలు ప్రతిపక్ష పార్టీ నాయకులను కేసుల పేరుతో వేధించడంలో మాత్రం ముందుటున్నారని ఎద్దేవా చేశారు. ఎన్ని కేసులు పెట్టినా వైఎస్సార్‌సీపీ పోరాట స్ఫూర్తిని అడ్డుకోలేరని హెచ్చరించారు.

ప్రశాంతంగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

మనుబోలు: మనుబోలు మండల కేంద్రంలో పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాలలో మనుబోలు, సైదాపురం మండలాలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. సోమవారం జరిగిన సోషల్ పరీక్షలో బాలుర పాఠశాలలో 22 మందికి గాను 11 మంది మాత్రమే హాజరవగా బాలికల పాఠశాలలో 15 మందికి గాను 9 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను కావలి డిప్యూటీ డీఈఓ హరిప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాలలో మౌలిక వసతులు పరిశీలించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షల చీఫ్ శ్రీనివాసులు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రమేష్ పర్యవేక్షించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆంజనేయునికి సింహ వాహనసేవ

నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న హనుమజ్జయంత్యుత్సవాలు సోమవారంతో పరిసమాప్తమయ్యాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆంజనేయస్వామికి సోమవారం రాత్రి సింహ వాహనసేవ వేడుకగా నిర్వహించారు. విశేషాలంకారంలో కొలువైన స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



తోటపల్లిగూడూరు: మండలంలోని చెన్నపల్లిపాళెం జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక సోమవారం జరిగింది. ఈ పూర్వ విద్యార్థులు రెండు జట్లుగా విడిపోయి క్రికెట్ ఆడి ఆనందాన్ని పంచుకున్నారు. పాతికేళ్ల నాటి క్రికెట్ జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంబర పడ్డారు. పూర్వ విద్యార్థులను సమన్వయ పరచిన వారిలో కావలి రెడ్డి రంగారెడ్డి, ఊటుకూరు శ్రీనివాసులు, షేక్ అబూబకర్, శేషు సుబ్రమణ్యం, రవూరు గోవర్ధన్‌రెడ్డి, భక్తవత్సలరెడ్డి తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా వినాయక విగ్రహాల తయారీ



బొమ్మల తయారీకి ముడిసరుకు దిగుమతి

- రూ.లక్షలు వెచ్చించి ముడిసరుకు తెచ్చుకుని..
- బొమ్మలను తయారు చేస్తున్న కార్మికులు

పొదలకూరు: మరో మూడు మాసాల్లో వచ్చే వినాయక చవితి కోసం ఇప్పటి నుంచే బొమ్మలు తయారు చేస్తున్నారు. పట్టణంలో దశాబ్ద కాలంగా వినాయకుని ప్రతిమలను తయారు చేసి అమ్ముతున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన తయారీదారులు పద్మావతి నగర్లో విగ్రహాలను తయారు చేస్తున్నారు. సెప్టెంబరు నాటికి గ్రామాల్లో వినాయకుని ప్రతిమలను అందివ్వాలంటే పనిలో వేగం పెంచాలని వారు పేర్కొన్నారు. ప్రతి ఏడాది వినాయక చవితి సందర్భంగా తయారీదారులు రూ.లక్షలు వెచ్చించి బొమ్మలను రూపొందిస్తారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రంపపు పొట్టు, టెంకాయపీచు, చెక్కలు తదితర ముడిసరకును భారీగా కొనుగోలు చేస్తారు. రెండు దశల్లో బొమ్మలను తయారు చేసి అమ్మకాలు సాగిస్తారు. ప్రతిఏటా ఫిబ్రవరి లేదా మార్చినెల నుంచే బొమ్మల తయారీ పనులు ప్రారంభించి జూన్ చివరి వారంలోగా పూర్తి చేస్తారు. రెండో దశలో తయారు చేసిన ప్రతిమలకు రంగులను అద్దడం ప్రారంభించి పండుగనాటికి బొమ్మలను సిద్ధం చేస్తారు.



వినాయకుడి ప్రతిమల తయారీలో కార్మికుడు

పౌష్టికాహారం అందజేత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేశారు. దాత నందిమండలం సుబ్బరాజు, భానుశ్రీ, పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు చింతల అమరేందర్‌రెడ్డి, పొన్నం రవిచంద్ర, కోశాధికారి గోపినాథ్ రాఘవేంద్రశెట్టి, డీవీ సుబ్బరాజు, చంద్రమౌళి, నాగేశ్వరరావు, రాజా రమేష్, విజయమోహన్‌నాయుడు పాల్గొన్నారు.

కాకాణికి మద్దతుగా..

మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అక్రమ అరెస్ట్ నేపథ్యంలో సర్వేపల్లి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వారి ఖండనలు తెలిపారు. ఈ క్రమంలో వెంకటగిరిలోని కోర్టు వద్దకు, జిల్లా కేంద్ర కారాగారానికి భారీగా పార్టీ శ్రేణులు తరలి వెళ్లి తమ మద్దతు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నెల్లూరు



వెంకటగిరి కోర్టు వద్దకు భారీగా చేరిన పార్టీ శ్రేణులు



వెంకటగిరి కోర్టు వద్ద పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి





నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారం వద్ద..